
సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం, 4, సెప్టెంబర్, 2023



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్నకు చెందిన 18 కోడెలు, రెండు ఆవులను ఖమ్మం జిల్లా చౌటపల్లి శ్రీతిరుపతమ్మ గోశాలకు అందజేశారు.



మిడ్‌మానేరుకు వరద

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లోకి మూలవాగు నుంచి 1,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. ఎల్‌ఎండీలోకి 300 కూసెక్కుల నీరు వెళ్తోంది.

గరిష్టం/కనిష్టం

29.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'సోనియాగాంధీ రుణం తీర్చుకుందాం'



కాంగ్రెస్‌లో చేరుతున్న చీర్లవంచకు చెందిన ముదిరాజ్‌లు

వేములవాడ: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకుందామని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచకు చెందిన ముదిరాజ్‌లు ఆదివారం కాంగ్రెస్‌లో చేరగా.. ఆది శ్రీనివాస్ కండువా కప్పి ఆహ్వానించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని కోరారు. కాంగ్రెస్‌కు ఓటు వేసేందుకు ప్రజలను చైతన్యపరచాలన్నారు. ముంపు గ్రామాలకు న్యాయం జరిగేలా ఎన్ని ఉద్యమాలు చేసిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇప్పటికీ సమస్యలు తీర్చలేక ఇబ్బందులు పెడుతున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పిల్లి కనకయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బోనాల రమేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు ఇర్నాల గణేశ్, ఎస్సీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షుడు కుర్మ రవి తదితరులు పాల్గొన్నారు.

6న నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

వేములవాడఅర్బన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో ఈనెల 6న జిల్లా స్థాయిలో సీనియర్ మహిళ, పురుషుల నెట్‌బాల్ టోర్నీకి ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు శిరీష, ఆర్గనైజింగ్ సెక్రటరీ జలంధర్ తెలిపారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులు పదోతరగతి మెమో జిరాక్స్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 10 గంటల్లోపు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 91002 05226, 79953 46338 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాజన్న అన్నదాన సత్రానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

వేములవాడ: రాజన్న అన్నదాన సత్రానికి రూ.లక్ష విరాళాన్ని పటాన్‌చెరువుకు చెందిన చొక్కారపు రాములు–పుష్ప కుటుంబ సభ్యులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

కిక్‌బాక్సింగ్‌లో చిన్నారుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన పలువురు చిన్నారులు కిక్‌బాక్సింగ్‌లో ప్రతిభ కనబరిచారు. ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో గత వారం హరివంశ్ తానా భగత్ ఇండోర్‌స్టేడియంలో జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జరిగాయి. సిరిసిల్లకు చెందిన కోచ్ ఒడ్నాల శ్రీనివాస్ సారథ్యంలో ఆరుగురు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జూనియర్స్ విభాగంలో నలుగురు సిల్వర్ మెడల్స్ సాధించారు. వాసం సుచిత్, దరహాస్, కంచర్ల అశ్విత్, గజ్జెల రిషిథ్, దూడం అర్జున్ పతకాలు సాధించారు. చిన్నారులను ఎస్పీ అఖిల్‌మహాజన్, సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అక్కనపల్లి వినోద్ అభినందించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

వేములవాడరూరల్: గంజాయి విక్రయిస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరిని వేములవాడ రూరల్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపిన వివరాలు. జార్ఖండ్‌కు చెందిన రాకేశ్‌కుమార్, కొత్తపల్లి మండలం ఎన్టీయార్ తమిళకాలనీకి చెందిన రాజ్‌కుమార్‌తో కలిసి గంజాయిని విక్రయించేందుకు వేములవాడకు వస్తున్నాడు. ఈక్రమంలో బోయినపల్లి ఎస్ఐ మహేందర్ నర్సింగాపూర్ స్టేజీ వద్ద పట్టుకున్నారు. వారి నుంచి 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, రిమాండ్ చేశారు. గ్రామాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కురిసిన వర్షం.. కర్షకుల హర్షం

- 20 రోజులుగా వర్షాలు లేక.. దిక్కులు చూసిన రైతులు
- ఆదివారం విస్తారంగా కురిసిన వాన
- పిడుగుపాటుకు సిరిసిల్లలో యువకుడి మృతి
- పెద్దలింగాపూర్‌లో అత్యధికంగా 112.0 మిల్లీమీటర్లు
- మల్లారంలో అత్యల్పంగా 19.8 మిల్లీమీటర్లు
- పారుతున్న మానేరు, మూలవాగులు



వట్టిమల్లలో కొట్టుకుపోయిన మూలవాగు కాజ్‌వే



సిరిసిల్లలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

సిరిసిల్ల: జిల్లాలో ఆదివారం విస్తారంగా వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో కూడిన వాన పడింది. సిరిసిల్లలో క్రికెట్ ఆడేందుకు వెళ్లిన పడిగె సతీశ్(32) పిడుగుపాటుకు గురై మరణించాడు. క్రికెట్ ఆడేందుకు గ్రౌండ్‌కు వెళ్లగా.. ఉరుములు మెరుపులతో వర్షం రావడంతో సమీపంలోని చెట్టు వద్దకు వెళ్లారు. ఐదుగురు స్నేహితులతో కలిసి వెళ్లిన సతీశ్ పిడుగు పడడంతో అక్కడికక్కడే మరణించాడు. వరుసగా 20 రోజులపాటు చినుకు కురవకపోవడంతో పంటలు తడారిపోయాయి. ఎండల వేడితో ఉక్కపోత పరిస్థితి నెలకొంది. ఆదివారం నాటి వానాలు పంటలకు జీవం పోశాయి.

కలుపు తీశారు.. మందు వేశారు

జిల్లాలో 2.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేశారు. అత్యధికంగా వరిని 1,62,036 ఎకరాల్లో వేశారు. ఇప్పుడు వరి పంట ముదురుకలుపు పూర్తయింది. మందులు సైతం చల్లారు. జిల్లాలో పత్తి పంటను 74,492 ఎకరాల్లో పత్తి వేశారు. పత్తిలోనూ కలుపు తీసి, మందువేసి డౌర కొట్టారు. పంటలు ఏపుగా ఎదుగుతున్న తరుణంలో వానలు లేక బెంగపడిన రైతులకు ఈ వాన ఊపిరి పోసినట్లు అయింది. ఈ ఏడాది మరో రెండు, మూడు వర్షాలు దసరా వరకు గట్టిగా పడితే.. పంట పండినట్లేనని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షపాతం వివరాలు.

జిల్లాలోని 21 ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం వివరాలను జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి పీ.బీ.శ్రీనివాసాచారి వెల్లడించారు. జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో అత్యధికంగా వర్షం కురిసింది. ఇందులో ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో 112.0 మిల్లీమీటర్లు, కందికట్కూర్‌లో 93.0, ఇల్లంతకుంటలో 87.0, కోనరావుపేట మండలం మర్తనపేటలో 75.5, తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో 72.0 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. వీర్నపల్లిలో 58.0, బోయినపల్లిలో 55.0, ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో 52.3, ఎల్లారెడ్డిపేటలో 50.8, సిరిసిల్ల కలెక్టరేట్‌లో 50.8, ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో 50.3, కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో 48.5, చందుర్తి మండలం మరిగడ్డలో 48.5, రుద్రంగిలో 47.5, మానాలలో 44.8, సిరిసిల్ల శివారులోని పెద్దూరులో 43.3, వేములవాడ మండలం నాంపల్లి వద్ద 32.5, మల్లారం వద్ద 19.8, గంభీరావుపేట మండలం గజసింగారం వద్ద 32.0, వేములవాడ మండలం వట్టెంల వద్ద 31.3, గంభీరావుపేటలో 28.8 మిల్లీమీటర్ల వర్షం పడింది.



వేములవాడ వద్ద మూలవాగ ప్రవాహం

నీటి వనరుల్లోకి వరదనీరు

గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు, కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు జలాశయాల్లోకి వరదనీరు చేరుతోంది. మూలవాగు నిండుగా పారుతుంది. సిరిసిల్ల వద్ద మానేరువాగులో వరదనీరు మధ్యమానేరు జలాశయంలోకి చేరుతుంది. జిల్లాలోని 656 చెరువుల్లోకి వరదనీరు చేరింది. ఇప్పటికే 125 చెరువులు నిండి మత్తడి దూకుతుండగా 468 చెరువుల్లో నిండా నీరు చేరింది. జిల్లాలో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. మొత్తంగా వానాకాలం పంటలకు ఈ వానలు జీవం పోసినట్లు అయింది.



శంభో శంకర

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానాలు, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన అనంతరం ఆలయంలో స్వామివారికి అన్నపూజలు, కల్యాణ మొక్కులు చెల్లించుకున్నారు.



చిరుధాన్యాల సాగుకు గుర్తింపు

- గొల్లపల్లి రైతుకు రాష్ట్ర ఉత్తమ అవార్డు
- పురస్కారం అందుకున్న నర్సింహారెడ్డి
- ఇతర రాష్ట్రాల్లో చిరుధాన్యాల విక్రయం



డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు వేస్తున్న నర్సింహారెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తూ.. అధిక దిగుబడులు సాధిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన వంగల నర్సింహారెడ్డికి రాష్ట్రస్థాయి ఉత్తమ రైతు అవార్డు దక్కింది. ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు చిరుధాన్యాలు సాగుకు గౌరవం దక్కింది. సేంద్రియ పద్ధతుల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేస్తూ గుర్తింపు పొందారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 9వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నర్సింహారెడ్డికి అవార్డు అందజేసింది.

ఐదేళ్లుగా చిరుధాన్యాల సాగు

జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల వ్యవసాయశాఖల ప్రోత్సాహంతో 2018 నుంచి నర్సింహారెడ్డి చిరుధాన్యాల సాగును మొదలుపెట్టారు. రాగులు, కొర్రలు, సజ్జలు, అరికలు, సామ, జొన్న సాగుచేస్తూ లాభాలు పొందుతున్నారు. తోటి రైతులకు సైతం చిరుధాన్యాలు సాగు చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. తాను సాగు చేసిన చిరుధాన్యాల ఉత్పత్తులను నర్సింహారెడ్డి స్వయంగా మార్కెటింగ్ చేసుకుంటున్నారు. స్థానికంగా కాకుండా బెంగళూరు వంటి నగరాల్లో విక్రయిస్తున్నారు.

నూతన పద్ధతుల్లో వ్యవసాయం

మారుతున్న కాలానికి అనుగుణంగా సేద్యంలో నూతన పద్ధతులు ప్రవేశపెడుతున్నారు. వరిలో మిషన్‌తో నాట్లు వేయడం, డ్రమ్‌సీడర్ పద్ధతిలో విత్తడం, వెదజల్లే పద్ధతి, ఆరుతడి పద్ధతిలో సాగుచేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. గతేడాది అధిక సాంద్రత పద్ధతిలో పత్తిలో మంచి దిగుబడులు సాధించి ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారు. నర్సింహారెడ్డి పాటిస్తున్న పద్ధతులకు 2019, 2022లో జిల్లాస్థాయిలో ఉత్తమ రైతు అవార్డులు అందుకున్నారు.

సంతోషంగా ఉంది



మారుతున్న కాలానికి అనుగుణంగా అందివచ్చిన పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అధికారుల సూచనలతో పంటలు సాగుచేసి అధిక దిగుబడులు సాధించా. వరిలో కొత్తమెలకువలతో పంటలను సాగు చేశా. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే చిరుధాన్యాలను పండించి ఇతర రాష్ట్రాలకు దిగుమతి చేస్తున్న. దీనిపై అనేక మంది రైతులకు అవగాహన కల్పించా. నేను పండిస్తున్న పంటలు, ఆధునిక పద్ధతులు గుర్తించి వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్రస్థాయి అవార్డు అందించడం సంతోషంగా ఉంది.

– వంగల నర్సింహారెడ్డి, రాచర్లగొల్లపల్లి

అప్రమత్తంగా ఉండండి

- అధికారులు హెడ్‌క్వార్టర్‌లో ఉండాలి
- లోలెవల్ కాజ్‌వేల వద్ద మానిటరింగ్ చేయాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం జిల్లాలోని అధికారులను అప్రమత్తం చేశారు. కలెక్టరేట్ నుంచి ఆదివారం టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో సోమ, మంగళవారాల్లోనూ వర్షాలు ఉన్న నేపథ్యంలో ఒక్క ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జలాశయాల వద్ద నీటి మట్టాలను పర్యవేక్షించాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. లోలెవల్ కాజ్‌వేల వద్ద ఫ్లెక్సీలతో హెచ్చరికబోర్డులు పెట్టి, మానిటరింగ్ అధికారులను నియమించాలన్నారు. రైతులు ఒర్రెలు, వాగులు దాటి పంట పొలాల్లోకి వెళ్లకుండా చూడాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరదనీరు రాకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ మంచినీరు ప్రజలకు అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనురాగ్ జయంతి స్పష్టం చేశారు. ముంపు ఉన్న ప్రాంతాల్లోని ప్రజలను సురక్షితమైన ప్రదేశాలకు తరలించాలన్నారు. పాత ఇళ్లు, శిథిలమైన ఇళ్లలో నివాసం ఉండకుండా చూడాలని, కరెంట్ స్తంభాలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్, మున్సిపల్ కమిషనర్లు ఎండీ ఆయాజ్, అన్వేశ్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, జిల్లా ఫిషరీష్ అధికారి శివప్రసాద్, సీపీవో శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

సాయుధ పోరాటవీరులను విస్మరిస్తున్న సర్కారు



లింగారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చాడ

ఇల్లంతకుంట(మానకొండూర్): తెలంగాణ ప్రభుత్వం సాయుధ పోరాటవీరులను విస్మరిస్తుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేయడంతోపాటు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. మండలంలోని గాలిపల్లి మాజీ సర్పంచ్ అయ్యన్నగారి లింగారెడ్డి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. సిరిసిల్లలో బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈనెల 11న భారీ బహిరంగసభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మండల కార్యదర్శి మల్లేశం, మంద సుదర్శన్, చంద్రం, బాలనర్సు, రామ్‌రెడ్డి ఉన్నారు.

ముదిరాజ్‌లకు మూడు సీట్లు ఇవ్వాల్సిందే..

- జిల్లా కేంద్రంలో మహాధర్నా
- పట్టణంలో భారీ ర్యాలీ
- బీఆర్‌ఎస్ తీరుపై వెల్లువెత్తిన నిరసన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ముదిరాజ్‌లు

సిరిసిల్లటౌన్: ముదిరాజ్‌లు రాజకీయ సమరశంఖం పూరించారు. అసెంబ్లీలో మూడు సీట్లు కేటాయించాలని కోరుతూ వందలాది మంది రోడ్డెక్కారు. జిల్లా కేంద్రంలో ఆదివారం మహాధర్నా చేపట్టారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండ ధర్నాను కొనసాగించారు. ముదిరాజు సంఘం జిల్లా అధ్యక్షుడు రాణవేని లక్ష్మణ్ ఆధ్వర్యంలో స్థానిక కాలేజీ మైదానం నుంచి నేతన్నచౌక్ మీదుగా గాంధీచౌక్ నుంచి అంబేడ్కర్‌చౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ముదిరాజు సంఘం కోర్ కమిటీ సభ్యులు చొక్కాల రాము, పిట్టల భూమేశ్, రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో ముదిరాజుల పాత్ర కీలకమన్నారు. అత్యధిక సంఖ్యలో ముదిరాజులు ఉన్న మునుగోడు, పఠాన్‌చెరువు, సంగారెడ్డి అసెంబ్లీ స్థానాలను ముదిరాజులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని నియోజవర్గాలలో పోటీచేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో పలు రాజకీయపార్టీలకు చెందిన ముదిరాజులు గొడుగు నర్సయ్య, ఉత్తమ్ అంజయ్య, రామ్‌గోపాల్, కీసరి నాగరాజు, రవి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని పార్టీలకు సిరిసిల్ల జెండాలే..



సిద్ధమైన కాంగ్రెస్, బీజేపీ జెండాలు



బీఆర్‌ఎస్ జెండాలు

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిరిసిల్ల లో రాజకీయ పార్టీల జెండాల తయారీ జోరందుకుంది. పార్టీ ఏదైనా జెండా మాత్రం సిరిసిల్లదే. ఇక్కడ తయారవుతున్న జెండాలు రెండు తెలుగురాష్ట్రాల్లోని గల్లీల్లో రెపరెపలాడుతున్నాయి. జెండాల తయారీతో సిరిసిల్లలోని కార్మికులకు చేతినిండా పని దొరుకుతుంది. తయారీదారులకు చక్కని ఉపాధిమార్గంగా మారింది.

– వంకాయల శ్రీకాంత్, సాక్షి ఫొటోగ్రాఫర్ రాజన్నసిరిసిల్ల



సిద్ధమవుతున్న వైఎస్సార్‌సీపీ జెండాలు

క్లుప్తంగా

సిరిసిల్లలో పెళ్లికి సింగపూర్‌వాసులు



పెళ్లి భోజనం చేస్తున్న సింగపూర్‌వాసులు

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలో ఆదివారం జరిగిన ఓ పెళ్లికి సింగపూర్‌వాసులు హాజరయ్యారు. మున్సిపల్ కౌన్సిలర్ గూడూరి భాస్కర్ కూతురు వాణి వివాహం జేపీ నగర్‌కు చెందిన గౌడ లక్ష్మణ్ కుమారుడు బాలకృష్ణతో కల్యాణలక్ష్మి గార్డెన్స్‌లో జరిగింది. సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన వరుడి ఆహ్వానం మేరకు సహోద్యోగులు ఆరుగురు పెళ్లికి హాజరయ్యారు. సంప్రదాయబద్ధంగా జరిగిన వివాహ క్రతువు, విధి విధానాలను చూసి, ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఫోన్లలో ఫొటోలు తీశారు. తెలంగాణ వంటకాల రుచి చూశారు. వారితో స్థానికులు సెల్ఫీలు దిగారు.

పేకాట స్థావరంపై దాడి

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మర్తనపేట శివారు ఎల్లమ్మ ఆలయ సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేకాఆడుతున్న సిరిసిల్లకు చెందిన ఐదుగురిని పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.7,280 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. అందరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

● డీఎస్పీ ఉదయ్‌రెడ్డి



సిరిసిల్లక్రైం: జిల్లాలో ఎడతెరిపి లేకుండా ఉరుములు, పిడుగుల తోపాటు కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి ప్రజలకు సూచించారు. వర్షం పడుతున్న సమయంలో ఎవరూ చెట్ల కిందకు వెళ్లవద్దని, చెట్ల మీద పిడుగులు పడే అవకాశం ఉంటుందన్నారు. ఆదివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాలకు చెందిన ఒకరు మరో నలుగురితో కలిసి క్రికెట్ ఆడేందుకు వెళ్లగా వర్షం పడుతుండడంతో ఓ చెట్టు కిందకి వెళ్లి నిలబడగా.. అదే సమయంలో పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. వర్షాలు కొడుతున్న సమయంలో ఎవరూ బయటకు రావొద్దన్నారు. ఎడతెరపి లేకుండా వర్షం పడుతుండడంతో వాగులు, చెరువులు పొంగి ప్రవహించే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తక్షణ సహాయం కోసం డయల్ 100 సమాచారం ఇవ్వాలని కోరారు.

డీసీఎం – కారు ఢీ

మానకొండూర్: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్రగాయాలైనాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన కొందరు ఆదివారం హన్మకొండలో జరిగే వివాహ వేడుకకు కారులో బయలుదేరారు. మానకొండూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో కరీంనగర్– వరంగల్ ప్రధాన రహదారిపై డీసీఎం, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ ఆకుదాడి కిరణ్, ఆకుదాడి చరణ్, జోగురు మల్లేశ్, జోగురు చంద్రమొగిలి, జోగురు కళ్యాణి, జోగురు ఆదిదేవ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేస్తే.. ఇళ్లు గుల్ల



ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట లోని కాయితీ మహేందర్‌రెడ్డి ఇంట్లోని బీరువా పరిస్థితి. దొంగలు పడి బీరువాలోని విలువైన వస్తువులు, బంగారం నగలు, నగదు ఎత్తుకెళ్లారు. రూ.3లక్షల నగదు, 8 తులాల బంగారం మాయమైంది. గ్రామంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలు సులువుగా తమ పని కానిచ్చుకొని పరారయ్యారు. వారి ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులకు సీసీ కెమెరాలు లేకపోవడంతో వివరాలు తెలుసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు.



ఈ వృద్ధురాలు కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన అర్తిని ఎల్లవ్వ. ఆగస్టు 25న గ్రామ శివారులోని గుంటి హన్మాన్ ఆలయ సమీపంలో రోడ్డు పక్కనే పొలం పనులు చేసుకుంటుంది. బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఎల్లవ్వతో మాటలు కలిపి మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు.



రెడ్డితండాలో విచారణ జరుపుతున్న సీఐ, ఎస్సై



ఈ ఇల్లు ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన దండం మైసయ్యది. 3 నెలల క్రితం బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో తాళం వేసి కుటుంబ సభ్యులంతా బంధువుల గ్రామానికి వెళ్లారు. వారు తిరిగొచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు లోపలికి ప్రవేశించి బీరువాను ధ్వంసం చేసి, అందులోని 2 తులాల బంగారం, రూ.లక్ష ఎత్తుకెళ్లారు. కడు పేదరికం అనుభవిస్తున్న మైసయ్య కుటుంబం ఈ చోరీతో రోడ్డున పడింది. అదే రోజు రాజన్నపేటలోనే మరో ఆరు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు.

- వరుస దొంగతనాలు.. వణుకుతున్న జనం
- మూలనపడ్డ సీసీ కెమెరాలు
- చిక్కని దొంగలు
- వలస కార్మికులపైనే అనుమానాలు
- వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. పట్టపగలు రెక్కీ నిర్వహిస్తూ పథకం ప్రకారం రాత్రి దోచుకెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలు చిక్కడం లేదు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఇటీవల కమ్యూనిటీ పోలీసింగ్‌తో సీసీ కెమెరాల ఏర్పాటుపైనే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని ఒక్క రాజన్నపేటలో మూడు నెలల కాలంలో ఎనిమిది ఇళ్లల్లో చోరీలకు పాల్పడడం దొంగల బరితెగింపును తెలియజేస్తుంది. వరుస దొంగతనాలతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతుంది. పోలీసుల రాకపోకలు, పెట్రోలింగ్ చేస్తున్న ప్రాంతాలను ముందే గుర్తించి మరో ప్రాంతాన్ని చోరీలకు పాల్పడడం కలవర పెడుతుంది.

పనిచేయని సీసీ కెమెరాలు

జిల్లా వ్యాప్తంగా 255 గ్రామపంచాయతీల్లో సుమారు 70 శాతం గ్రామాల్లో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. కెమెరాల నిర్వహణపై పట్టింపు లేకపోవడంతో సగానికి పైగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. జిల్లాలో 1200లకు పైగా సీసీ కెమెరాలను గతంలో ఏర్పాటు చేశారు. ఇందులో వెయ్యికి పైగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ పాలకవర్గాలు సీసీ కెమెరాల నిర్వహణపై దృష్టి పెట్టాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు.

వేలిముద్రల సేకరణలో పోలీసులు

ఇటీవల జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికుల రాక పెరిగింది. జిల్లాలో భవన నిర్మాణాల పనులు ముమ్మరం కావడం, వ్యవసాయ పనులు సైతం ఊపందుకోవడం, కోళ్లషెడ్లలో పనిచేసేందుకు స్థానికంగా కూలీల కొరతతో చాలామంది మధ్యవర్తులు ఇతర రాష్ట్రాలు బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా నుంచి వేలకొలది కార్మికులను కాంట్రాక్టుపై ఇక్కడికి తీసుకొస్తున్నారు. కాంట్రాక్టర్లు ఇక్కడి అధికారులకు వారి వద్ద ఉన్న కూలీల సమాచారం ఇవ్వడం లేదు. వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో అపరిచిత వ్యక్తుల సంచారం పెరగడంతో వారిపై పోలీసులు నిఘా పెట్టారు. గత పదిహేను రోజులుగా జిల్లాలో జరుగుతున్న దొంగతనాల నేపథ్యంలో వలసకూలీల వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వలసకూలీల వివరాలతో కూడిన జాబితాను తయారు చేయడమే కాకుండా వేలిముద్రలు సేకరిస్తున్నారు. దొంగతనాలు జరిగిన సందర్భాల్లో వలసకార్మికుల వేలిముద్రలతో పోల్చి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

వరుస చోరీలతో వణుకు

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలంలో గత పదిహేను రోజుల్లోనే వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో రెండుసార్లు గ్రామంలో అంగడి జరిగిన రోజే దొంగతనం జరగడంతో శుక్రవారం వస్తుందంటే ప్రజలు జంకుతున్నారు. గ్రామంలో వరుస చోరీలు జరుగుతున్నా పోలీసుల నుంచి స్పందన లేదన్న విమర్శలు వస్తున్నాయి. పలు గ్రామాల్లో దొంగతనాలు జరిగినా ఇప్పటి వరకు ఒక్క దొంగతనాన్ని కూడా ఛేదించలేకపోయారన్న ఆరోపణలు వస్తున్నాయి.

- ఆగస్టు 16న మరిమడ్లలోని రాయిని లత–రాజు, కుమ్మరి సుమలత, కుమ్మరి శ్రీలేఖ, దప్పుల రాజవ్వ, ఇండ్ల శ్రీనివాస్ ఇళ్లలో ఒకే రోజు దొంగలు చొరబడి రూ.62 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు.
- ఆగస్టు 5న జైసేవాలాల్ భుక్యారెడ్డితండాకు చెందిన భూక్య మోహన్ ఇంట్లో రూ.50 వేలు, 3 తులాల బంగారం, 50 తులాల వెండి, భూక్య మహిపాల్ ఇంట్లో 6 తులాల వెండి, 15 తులాల పట్టగొలుసులు, భూక్య నౌశిలాల్ ఇంట్లో రూ.4300 నగదు ఎత్తుకెళ్లారు.
- జూన్ 16న నిజామాబాద్, ఎగ్లాస్‌పూర్ ఎల్లమ్మ ఆలయాల్లో, కోనరావుపేట పెద్దమ్మ గుడిలో దొంగలు సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి బంగారు కండ్లు, యాంప్లిఫయర్ తదితర సామగ్రి ఎత్తుకెళ్లారు.
- మార్చి 29న భుక్యారెడ్డితండాలోని జగదాంబ ఆలయంలో పుస్తెలతాడు తదితర వస్తువులను ఎత్తుకెళ్లారు.
- మార్చి13న కోనరావుపేటలోని మల్లారెడ్డి ఇంట్లో దొంగతనం జరిగింది. విలువైన వస్తువులేవి పోలేదు. అంతకుముందు రెండిళ్లలో సుమారు రూ.లక్ష నగదు అపహరణకు గురయ్యాయి.
- మార్చి 6న సుద్దాలకు చెందిన కుంటెల్లి మల్లయ్యది 5 హెచ్‌పీ మోటార్, దొబ్బల దేవయ్యది 3 హెచ్‌పీ మోటార్, పల్లి బుచ్చిరాములు 3 హెచ్‌పీ, శీల శ్రీనివాస్ 3 హెచ్‌పీ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అంతకుముందు నిమ్మపల్లికి చెందిన మల్యాల నరేశ్, కటికెల రవి, గౌరు రవి, పూజం అంజయ్య, మల్యాల నరేశ్ ఇంట్లో 7 తులాల బంగారం, రూ.25 వేల నగదు, కటికెల రవి ఇంట్లో 60 తులాల వెండి, రూ.17 వేల నగదు ఎత్తుకెళ్లారు.
- నిమ్మపల్లికి చెందిన ఇద్దగిరి మల్లేశం ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాన్ని పగులగొట్టి చొరబడి ఇంట్లోని వస్తువులు చిందరవందర చేశారు. బీరువాలో ఉన్న తులం బంగారం ఎత్తుకెళ్లారు.
- అదే గ్రామానికి చెందిన కదిరె బాలవ్వ ఇంట్లో ఇద్దరు దొంగలు చొరబడి వృద్ధురాలి చేతులు కట్టేసి బంగారం, నగలు ఇవ్వాలని, లేకుండా చంపుతామని బెదిరించారు. ఆమె దగ్గర ఏమీ దొరక్కపోవడంతో వెళ్లిపోయారు.

నిఘా తీవ్రం చేశాం



వరుస దొంగతనాల నేపథ్యంలో నిఘా తీవ్రం చేశాం. రాజన్నపేటలో ఇటీవల జరిగిన దొంగతనంపై విచారణలో భాగంగా వేలిముద్రలు సేకరించాం. గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయని కారణంగానే నిందితులు సులభంగా తప్పించుకోగలుగుతున్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– రమాకాంత్, ఎస్సై, ఎల్లారెడ్డిపేట

పిడుగుపాటుతో యువకుడి మృతి



సతీశ్ (ఫైల్)

సిరిసిల్లఅర్బన్: క్రికెట్ ఆడేందుకు వెళ్లిన యువకుడు పిడుగుపాటుతో మృతిచెందిన సంఘటన సిరిసిల్లలో ఆదివారం విషాదం నింపింది. జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌కు చెందిన పడిగె సతీశ్(32) మెకానిక్ షాప్ నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. స్నేహితులతో కలిసి సిరిసిల్ల మున్సిపల్ పరిధి బోనాలకు క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో అక్కడే ఉన్న ఓ చెట్టు కిందికి సతీశ్‌తోపాటు అతని స్నేహితులు తలదాచుకున్నారు. అదే సమయంలో ఆ చెట్టుపై పిడుగు పడగా.. సతీశ్‌తోపాటు అతని స్నేహితులు కుప్పకూలిపోయారు. ఈ సంఘటనలో సతీశ్‌కు తీవ్రగాయాలు కాగా.. సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సతీశ్ అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కాగా మృతుడి అన్న ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు.

రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

పిడుగుపాటుతో మృతిచెందిన సతీశ్ కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు.

నిద్రలోనే పోయిన ప్రాణం

- గుండెపోటుతో దినసరి కూలీ మృతి
- అంత్యక్రియలకు దాతల సాయం



శివ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చిన్నవయస్సులోనే ఓ దినసరి కూలీ గుండె నిద్రలోనే ఆగిపోయింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేటలో తీవ్ర విషాదం నింపగా.. భార్య, కొడుకు రోడ్డున పడ్డారు. అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో దాతలు సాయం చేశారు. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన ఆవునూరి శివ(32) సిరిసిల్ల లేబర్ అడ్డాపై రోజు కూలీ వెతుక్కుని పనిచేస్తూ..కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం రాత్రి భార్య, కుమారుడితో కలిసి భోజనం చేసి పడుకున్న శివ ఆదివారం ఉదయం భార్య శ్రావణి లేపగా లేవలేదు. నిద్రలోనే గుండెపోటుతో మరణించినట్లు గుర్తించారు. స్వగ్రామంలో సొంతిల్లు లేక ఎల్లారెడ్డిపేటలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గుంటెడు భూమిలేని ఈ నిరుపేద దహన సంస్కారాలకు దాతలు ముందుకొచ్చారు. శివ మృతితో భార్య శ్రావణి, కుమారుడు ప్రణయ్(5) రోడ్డున పడ్డారు. ఈ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన ఆవునూరి శివ మృతిచెందగా.. దహన సంస్కారాలకు దాతలు ఆర్థిక సాయం అందించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య రూ.5వేలు, మొన్నటి వరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసి ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లిన వెంకటకృష్ణ రూ.5వేల సాయం అందించారు. అలాగే మరి కొందరు మరో రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

దాతలు ఆవునూరి శ్రావణి గూగుల్‌పే 70132 03115 నంబర్‌లో సాయం చేయాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

జమ్మికుంట(చొప్పదండి): కిరోసిన్‌తో నిప్పు అంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కందుకూరి రమాదేవి(45) చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. రమాదేవి పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో తల్లి సుగుణ ఇంట్లో ఉంటోంది. భర్త రామమూర్తి ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. గత నెల 16న తల్లి బంధువుల ఇంటికి వెళ్లగా రమాదేవి కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందింది. రమాదేవి మానసిక స్థితి బాగలేక ఆత్మహత్యకు పాల్పడిందని భర్త ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవి తెలిపారు.

జీలకుంటకు చెందిన యువకుడు..

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీలకుంట గ్రామానికి చెందిన కంది వంశీరెడ్డి (23) పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. వంశీరెడ్డి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం ఈనెల 2న తండ్రితో గొడవపడ్డాడు. తర్వాత పురుగులమందు తాగగా చికిత్సకోసం సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి సమ్మిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంగ్లిష్ ఇక ఈజీ

- ఇంటర్‌లో ప్రాక్టికల్ పరీక్షలు
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు
- విద్యార్థులకు చేరిన ప్రాక్టికల్ పుస్తకాలు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు



గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రస్తుత పోటీప్రపంచంలో ఇంగ్లిష్‌కు ఉన్న ప్రాధాన్యత అంతా.. ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కళాశాల విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రాక్టికల్స్ నిర్వహణపై దృష్టి సారించింది. ఇప్పటికే విద్యార్థులకు ప్రాక్టికల్స్ పుస్తకాలను ప్రభుత్వం అందజేసింది. ఈ విద్యాసంవత్సరంలో ఫస్టియర్ విద్యార్థులకు, వచ్చే విద్యాసంవత్సరం నుంచి సెకండియర్ విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఈమేరకు అధ్యాపకులకు ఇంగ్లిష్ సబ్జెక్టు బోధకులకు శిక్షణ ఇవ్వనున్నారు. మార్చిలో నిర్వహించబోయే ఇంగ్లిష్ సబ్జెక్టు ప్రాక్టికల్ పరీక్షలపై లెక్చరర్లు ఇప్పటి నుంచే విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

సైన్స్ విభాగం, వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులకు మాత్రమే ఇప్పటి వరకు ప్రాక్టికల్ నిర్వహించే వారు. ప్రస్తుతం ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం అన్ని విభాగాల వారికి ఆంగ్ల సబ్జెక్టుపై ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

ప్రాక్టికల్ అంశాలు ఇవే..

- ఇంగ్లిష్ సబ్జెక్టు ప్రాక్టికల్ పరీక్షకు 20 మార్కులు కేటాయించనున్నారు. రాత పరీక్షకు 80 మార్కులు ఉంటాయి. ప్రధానంగా నాలుగు అంశాలపై ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, జస్ట్ ఏ మినిట్(ఒక నిమిషంలో మాట్లాడడం), రోల్ ప్లే(ఇద్దరు విద్యార్థుల సంభాషణ), లిజనింగ్ అంశాలపై విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో అంశానికి నాలుగు మార్కుల చొప్పున 16 మార్కులు, రికార్డు నిర్వహణకు మరో నాలుగు మార్కులు కేటాయించనున్నారు. దీని వల్ల విద్యార్థులు ఇంగ్లిష్ సబ్జెక్టుపై పట్టు సాధిస్తారు. ఇంగ్లిష్‌లో మాట్లాడించడం, గ్రామర్ నేర్పడానికి ప్రత్యేక తరగతలు నిర్వహించనున్నారు.

ఇబ్బంది పడకుండా చూస్తున్నాం



ఇంగ్లిష్ సబ్జెక్టుకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారిని ముందస్తుగా సన్నద్ధం చేస్తున్నాం. ఇంగ్లిష్‌లో మాట్లాడిస్తున్నం. రెగ్యులర్ తరగతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఆంగ్ల సబ్జెక్టు ప్రాక్టికల్స్ కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. ఇంకా మాకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది.

– నాంపల్లి, ఆంగ్ల సబ్జెక్టు అధ్యాపకులు, గంభీరావుపేట కళాశాల

ఫస్టియర్ విద్యార్థులకు..



ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఆంగ్ల సబ్జెక్టుకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. ఇంటర్ బోర్డు ప్రత్యేకంగా తయారు చేసిన ప్రాక్టికల్ పుస్తకాలు కూడా అందాయి. ప్రాక్టికల్ పరీక్షలతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం, వినడం వంటి అంశాలపై పట్టు సాధిస్తారు.

– వెంకట్‌నాయక్, ప్రిన్సిపాల్, గంభీరావుపేట

చందనను ట్రాప్ చేశారా?

- నగలు, నగదు కోసమే హతమార్చారా?
- చడీచప్పుడు కాకుండా వెళ్తే హత్య జరిగేది కాదా?
- దీప్తి హత్యోదంతంపై అనేక అనుమానాలు

కోరుట్ల: ఇంట్లో నగలు, నగదు ఉన్న సమయంలోనే ప్రియుడితో కలిసి పరార్ కావాలన్న ఆలోచన చందనకు ఎవరు కల్పించారు? ఈ దిశలో ఆమెను ఎవరైనా గైడ్ చేశారా? ప్రేమ మోజులో ఆ యువతి వారి ట్రాప్‌లో పడిపోయిందా? ప్రియుడితో కలిసి వెళ్లకుండా అడ్డుకున్న అక్కను చివరకు హతమార్చే పరిస్థితికి దిగజారిందా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గతనెల 29 వేకువజామున పట్టణంలోని భీమునిదుబ్బలో ప్రియుడు ఉమర్ షేక్‌తో కలిసి చందన తన అక్క దీప్తిని సినీఫక్కీలో హత్యచేసిన కేసులో వెలుగులోకి వస్తున్న కోణాలు ఆసక్తి రేపుతున్నాయి.



శ్రీనివాస్‌రెడ్డి ఇల్లు

- పెళ్లి చేసుకోవాలని ఇంట్లో పెరుగుతున్న ఒత్తిడి గురించి చందన తన ప్రియుడికి చెప్పినట్లు సమాచారం.
- అయితే, 'మనకు జాబ్ లేదు.. ఎలాబతుకుతాం' అని డబ్బు, నగలు తీసుకొచ్చేలా ఉమర్ షేక్.. చందన దృష్టి మళ్లించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నాలుగేళ్ల పరిచయం..

- 2019లో చందన బీటెక్ చదవడం కోసం హైదరాబాద్ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో చేరింది.
- తన కంటే ఒక ఏడాది సీనియర్ ఉమర్ షేక్ సుల్తాన్ డిటెయిన్ కావడంతో చందనకు పరిచయం అయ్యాడు.
- అప్పటినుంచి వీరి ప్రేమాయణం సాగుతున్నట్లు సమాచారం.
- హాస్టల్‌లో ఉంటూ చందన తరచూ ఉమర్ షేక్ సుల్తానా ఇంటికి వెళ్లివస్తుండేదని తెలిసింది.
- ఈక్రమంలో వీరి ప్రేమ వ్యవహారం కొన్నాళ్లకు దీప్తికి తెలిసింది.
- ఆ తర్వాత ఇంట్లోనూ అందరికీ తెలిసి గొడవలు జరిగినట్లు సమాచారం.
- దీంతో చందన తండ్రి శ్రీనివాస్‌రెడ్డి తన కూతుళ్లు దీప్తి, చందనకు వివాహాలు చేయాలని సన్నాహాలు ప్రారంభించారు.
- ఆయన ఆంధ్రాకు చెందిన వ్యక్తి కావడంతో అక్కడే సంబంధాలు చూస్తున్నారు.

ప్రేమ..

- గతనెల 28వ తేదీన ఉదయం హైదరాబాద్ నుంచి కోరుట్లకు బయలుదేరిన విషయాన్ని ఉమర్ షేక్ తన తల్లి ఆలియా, చెల్లె ఫాతిమాకు చెప్పినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే, ఆ యువకుడు, అతడి కుటుంబానికి చందనపై కేవలం ప్రేమ మాత్రమే ఉండి ఉంటే నగలు, డబ్బు అవసరం లేదని చెప్పి ఉండవచ్చు కదా? అనే సందేహాలు వేధిస్తున్నాయి. సోమవారం రాత్రి దీప్తి మద్యం మత్తులో ఉన్న సమయంలో చందన, ఉమర్ కలిసి నగలు, డబ్బు సర్దే పనిచేయకుండా చడీచప్పుడు కాకుండా పరారై ఉంటే.. దీప్తి హత్యకు ఆస్కారం ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉమర్ షేక్ తల్లి గతంలో లెక్చరర్‌గా పనిచేసినట్లు సమాచారం. విద్యాధికులైన ఉమర్ షేక్ కుటుంబీకులు.. చందన, ఉమర్ కలిసి మంగళవారం నగలు, డబ్బులతో కారులో హైదరాబాద్ చేరుకోగానే.. ఇది తప్పని చెప్పి పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. అంతేకాకుండా అంతాకలిసి నగలు, డబ్బులతో తప్పించుకునే ప్రయత్నం చేయడం.. చందనను గుర్తుపట్టకుండా బుర్కా వేసి కారులో తీసుకెళ్లడం.. టోల్‌గేట్లకు చిక్కకుండా అడ్డదారుల్లో పయనించడం.. ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిందన్న అభిప్రాయాలకు ఊతమిస్తోంది.

నా బిడ్డను ట్రాప్ చేసింద్రు



నా బిడ్డ చందనను ఉమర్ ఫ్యామిలీ ట్రాప్ చేసింది. కొంతకాలంగా ఉమర్ కుటుంబ సభ్యులతో నా బిడ్డ టచ్‌లో ఉన్న విషయం నాకు తెలియదు. తెలిస్తే వెంటనే కట్టడి చేసేవాన్ని. ఉమర్ ఫ్యామిలీ చందనకు బ్రెయిన్ వాష్ చేసింద్రు. నగలు, డబ్బులు కోసం ప్లాన్ చేసింద్రు. నిజంగా నా బిడ్డపై ప్రేమ ఉంటే నగదు, నగలు ఎందుకు ఎత్తుకెళ్లారు? నా బిడ్డతో తప్పుడు వాయిస్ మెసేజ్ పంపించి నా పెద్దబిడ్డ దీప్తిని బద్నాం చేసేందుకు యత్నించారు. దీప్తి కనీసం ఇంట్లో చాయ్ కూడా తాగదు. అలాంటిది వొడ్కా తాగిందని చందన చేత ఉమర్ ఫ్యామిలీ వాయిస్ మెసేజ్‌లో చెప్పించింది. ఇదంతా తప్పు. ప్రేమ పేరిట చందనను ట్రాప్ చేసి దీప్తి చావుకు కారణమైన వాళ్లకు కఠిన శిక్ష పడాలి. – శ్రీనివాస్‌రెడ్డి (దీప్తి, చందన తండ్రి)

రిమాండ్‌కు నిందితులు..

దీప్తి హత్య, డబ్బులు, నగలు ఎత్తుకెళ్లిన కేసులో నిందితులు బంక చందన, ఆమె ప్రియుడు ఉమర్‌షేక్ సుల్తానా, ఇతడి తల్లి ఆలియా, చెల్లి ఫాతిమాతోపాటు బంధువు హఫీజ్‌ను ఆదివారం మధ్యాహ్నం జడ్జి వద్ద పోలీసులు హాజరుపరిచారు. జడ్జి ఆదేశాల మేరకు 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిందితులపై ఐపీసీ 302, 201, 120(బీ),380 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

ప్రాణాలు తీసిన అప్పులు

- క్రిమిసంహారక మందుతాగి రైతు, ఉరేసుకొని కౌలు రైతు బలవన్మరణం

రామడుగు(చొప్పదండి)/జమ్మికుంట(హుజూరాబాద్): అప్పుల బాధతో మనస్తాపం చెందిన యువ రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. రామడుగు మండలం దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు వెల్మల కుమార్(34) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. కుమార్ తనకున్న రెండెకరాలతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకొని పత్తి, వరి పంటలు సాగు చేశాడు. గతంలో కురిసిన వడగండ్ల వర్షంతో వరి పంటకు పూర్తిగా నష్టం వాటిల్లింది. రెండేళ్ల క్రితం అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాడు. వ్యవసాయంతో పాటు ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.7 లక్షల మేర అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో ఈనెల 1న రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య భూమిక, కొడుకు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విలాసాగర్‌లో కౌలు రైతు..

జమ్మికుంట మండలం విలాసాగర్‌కు చెందిన కౌలు రైతు గరిగంటి రాజు(34) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజు, రజిత దంపతులు కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. గతేడాది ఒక ఎకరం భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. పంట పండకపోగా రూ.2లక్షల వరకు అప్పులయ్యాయి. రాఖీ పండుగ సందర్భంగా భార్య తల్లిగారింటికి వెళ్లింది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజు ఉరేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.